క్లుప్తంగా

రేపు మెగా జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోటలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల యువతీయువకులు ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96186 55759, 95532 02509, 97414 32931, 88977 76368 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

రేపు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశం

రాయచోటి జగదాంబసెంటర్ : ఈ నెల 31వ తేదీన రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లాస్థాయి సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు రాయచోటి డివిజన్ కన్వీనర్ సీఆర్‌వీ సుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పదవీ విరమణ చెందిన ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు చర్చించడంతో పాటు రాయచోటి డివిజన్ స్థాయిలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రిటైర్డ్ అయిన ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పరామర్శ



రెడ్డన్నను పరామర్శిస్తున్న బాలసుబ్రమణ్యం

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకులు పూలికుంట రెడ్డన్న ఇటీవల అనారోగ్యానికి గురై తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బడి బయట పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్



బడి బయట పిల్లలతో తల్లిదండ్రులు, టీచర్లు

చిట్వేలి : బడి బయట పిల్లల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దుర్గరాజులు బడి బయట పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సీఆర్‌పీలకు సూచించారు. ఇందులో భాగంగా సీఆర్‌పీ చంద్రశేఖర్ రాజుకుంట పంచాయతీ ఎస్టీ కాలనీలో పాఠశాల బయట ఉన్న 12 మంది విద్యార్థులను గుర్తించి చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లను విద్యార్థులకు అందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ

పెనగలూరు : అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం మధ్యాహ్నం ఎంపీడీఓ విజయారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు పెట్టే భోజనాన్ని పరిశీలించి పిల్లలతోపాటు ఎంపీడీఓ భోజనం రుచి చూశారు. అలాగే ఇచ్చిన పదార్థాలకు సమయం ఉందా లేదా అనేది క్షుణ్ణంగా పరిశీలించి పిల్లలకు ఇవ్వాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం : మండలంలోని భాకరాపేట, మాధవరం-1, ముమ్మడిగుంటపల్లి, బొగ్గిడివారిపల్లె గ్రామాల్లో పాడి పశువులు ఎక్కువగా ఉన్నాయని వర్షా కాలంలో గేదెలు మురుగు నీరు తాగడం వల్ల గొంతువాపు సోకే ప్రమాదం ఉందని భాకరాపేట పశువైద్యాధికారి డాక్టర్ శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో బర్రెలు, గేదెలు కలిగిన పాడి పశువుల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గొంతువాపు ఉన్న బర్రెలకు, గేదెలకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, అలాగే గొర్రెలకు సంబంధించి మూతికి పుండ్లు ఉన్నట్లయితే సంబంధిత పశువుల ఆసుపత్రికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

పెద్దతిప్పసముద్రం: కర్నాటక రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో పెద్దతిప్పసముద్రం మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసుల నిఘా ముమ్మరం చేశారు. మదనపల్లి డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో మంగళవారం పోలీస్ బృందం శివారు ప్రాంతాలను డ్రోన్ కెమెరాతో పరిశీలించింది. అక్రమ రవాణా, కోడి పందేలు, పేకాట జరిగే స్థావరాలను క్షుణ్ణంగా చిత్రీకరించారు.

ఎంత అవసరమో.. అంతే వేద్దాం

- అవసరానికి మించి ఎరువులు వాడితే దుష్పరిణామాలు
- సేంద్రియ ఎరువులతో లాభాలు



వంతాటిపల్లెలో పంటకు యూరియా వేస్తున్న రైతు

సిద్దవటం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు వరి పంటను ముమ్మురంగా సాగు చేస్తున్నారు. అయితే పంటల సాగులో ఎరువులదే కీలక పాత్ర. ఏ ఎరువు ఎంత మోదాదులో వేయాలి, ఎంత వేస్తే ఆశించిన దిగుబడులు వస్తాయనే విషయం తెలియక చాలా మంది రైతులు ఇష్టానుసారంగా ఎరువులు వేస్తుంటారు. దీని వల్ల కలుపు విపరీతంగా పెరుగుతుందే తప్ప దిగుబడులు రావు. అలాగే పంట కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రావు. పక్క రైతులు అధికంగా ఎరువులు వేస్తుంటే వారి చూసి మిగతా వారు కూడా అంతకుమించి ఎరువులు వేస్తున్నారు. ఇలా ఒకరిని చూసి మరొకరు అధికంగా ఎరువులు వేయరాదని సిద్దవటం మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. తగిన మోతాదులో వేసుకుంటే పంట దిగుబడులు పెరగడమే గాకుండా భూములు బండబారి పోకుండా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భూసార పరీక్షలు చేయించుకొని అందుకు తగ్గట్టు వ్యవసాయాధికారులను గాని, శాస్త్రవేత్తలను గాని సంప్రదించి ఎరువులు వేసుకుంటే ఆదాయం పొందవచ్చు. భూమిలో పోషక పదార్థాలను గుర్తించి పంటలకు అనుగుణంగా రసాయనిక ఎరువులు వేసుకుంటే మేలు. నేల స్వభావం, భూమిలోని పోషక పదార్థాలను అనుసరించి ఎరువులు వేసుకుంటే పంట పండుతుంది.

నేల స్వభావాన్ని బట్టి ఎరువు

నేల స్వభావానికి అనుగుణంగా వివిధ పంటలకు కావాల్సిన రసాయనిక ఎరువులను ఎంపిక చేసుకోవాలి. ఆమ్ల భూములైతే ఆమ్లత్వం కలిగిన ఎరువులను ఉపయోగించకూడదు. సమస్యాత్మక నేలల్లో వివిధ పంటలు సాగు చేసేటప్పుడు ఆమ్ల భూమలులైతే సున్నం, క్షార భూములైతే జిప్సం భూసార పరీక్షలకు అనుసరించి ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా చౌడు భూముల్లో చౌడు స్థాయిని బట్టి జిప్సం వేసుకోవాలి. పరోక్షంగా ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి వివిధ సూక్ష్మ పోషకాలు అందుబాటులోకి వస్తాయి. బంకమట్టి రేణువుల స్వభావాన్ని బట్టి సిఫార్సు చేసిన నత్రజని ఎరువులను ఎన్ని దఫాలలో వేసుకోవాలనే ఆధారపడి ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు.

ఎరువుల ఎంపిక కీలకం

వాతావరణ పరిస్థితులకు అనువైన రకాలను ఎంపిక చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని వరి రకాలను బట్టి నత్రజని ఆవశ్యకత ఆధారపడి ఉంటుంది. ఆహార దుంపజాతి పంటలకు నత్రజని ఎరువులు అవసరం ఎక్కువగా ఉంటుంది.

సమతుల్యత అవసరం

తేలిక నేలల్లో అయితే సేంద్రియ రసాయనిక ఎరువులు 40:60 నిష్పత్తిలోను, బరువు నేలల్లో అయితే 30:70 నిష్పత్తిలోను వేసి సమతుల్యతను పాటించాలి. రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను కలిపి వేయడం వల్ల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వివిధ సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందుబాటులోకి వస్తాయి. వివిధ వ్యవసాయ వ్యర్థాలను కంపోస్టుగా మార్చి ఉపయోగించినప్పుడు యూరియా వంటి ఎరువుల సామర్థ్యం, నత్రజని లభ్యత పెరుగుతుంది.

మందుల వాడకంలో జాగ్రత్త వహించాలి



రైతులు రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడకంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. మాస్క్, గ్లౌజులు వాడాలి. చల్లడం పూర్తయిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కొని ఆహార పదార్థాలు తీసుకోవాలి. రసాయనిక ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గించాలి. ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గించి, నికర ఆదాయం పెంచుకోవచ్చు. సూచనలు, సలహాలకు వ్యవసాయ అధికారులను రైతులు సంప్రదించాలి.

- కె.రమేష్‌రెడ్డి, వ్యవసాయాధికారి, సిద్దవటం మండలం

సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కరువు

- ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం
- ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలంటూ హితవు



బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

రాయచోటి : జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు ఆరోపించారు. అన్నమయ్య జిల్లాలో మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో 'సంక్షేమ హాస్టళ్ల బాట'లో భాగంగా పలు హాస్టళ్లను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాయచోటి పట్టణం సుండుపల్లి రోడ్డులో ఉన్న బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్‌దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు పూర్తిగా క్షీణించి పోయాయన్నారు. ఫలితంగా కనీస వసతులకు నోచుకోలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వడం లేదని, దోమలు ఎక్కువయ్యాయని, రెండు సంవత్సరాలుగా ట్రంక్ పెట్టెలు, బెడ్లు, బెడ్‌షీట్లు లేక పిల్లలు అసౌకర్యంగా కాలాన్ని గడుపుతున్నారన్నారు. అనేక హాస్టల్స్‌లో ఇన్‌చార్జ్ వార్డన్, ఇన్‌చార్జ్ సెక్యూరిటీలు అందుబాటులో లేరన్నారు. వంట మాస్టర్లు లేకపోవడంతో భోజనం తయారీపై సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఏడాది క్రిందట అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ హాస్టల్స్ పరిస్థితిపై దృష్టి పెట్టడంలో విఫలమైందన్నారు. సమస్యలు పెరిగిపోతున్నా చర్యలు తీసుకోకపోవడం విద్యార్థులలో ఆందోళన కల్గిస్తుందన్నారు. ఈ ప్రభుత్వం పత్రికల ప్రకటనలకే పరిమితమవుతోందని ఆరోపించారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ కాలం వృథా చేయడం కాకుండా హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవచూపాలని హితవు పలికారు.

ఖాళీలను భర్తీ చేయాలి..

హాస్టళ్లలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులు తక్షణమే అందజేయాలన్నారు. ప్రతి హాస్టల్‌ను పర్యవేక్షించడానికి సంబంధిత అధికారులను బాధ్యత వహించేలా చేయాలన్నారు. సంక్షేమం మాటల్లో కాకుండా కార్యాచరణలో చూపించాలని విద్యార్థి విభాగం నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నూర్ బాషా, శివకుమార్, బాబు గౌడ్, ఎస్సీ సెల్ నాయకులు ఆంజనేయులు, విద్యార్థి విభాగం టౌన్ అధ్యక్షులు మొఘల్ ఫైజాన్ బేగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫైజాన్, విద్యార్థి సంఘ నాయకులు షేక్ హుస్సేన్, షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు పంట నమోదు తప్పనిసరి



పసుపు సాగును ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

సిద్దవటం : ఉద్యాన పంటలైన మామిడి, చీనీ, నిమ్మ, అరటి, పసుపు, చామంతి తదితర పంటలను రైతులు ఈ-క్రాప్ బుకింగ్ (పంట నమోదు) తప్పనిసరిగా చేయించుకోవాలని ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని నేకనాపురం, మాధవరం, సిద్దవటం, భాకరాపేట గ్రామాల్లో పంట నమోదు మొదలైయిందన్నారు. ప్రక్రియను సంబంధిత రైతుసేవా కేంద్రం సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం సిబ్బంది ప్రతి రోజు తప్పనిసరిగా 50 ఎకరాలకు పంట నమోదు చేయాలని ఆదేశించామన్నారు.

పసుపు, ఉల్లి పంటలకు బీమా వర్తింపు

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పసుపు, ఉల్లి పంటలకు బీమా కోసం ప్రీమియం చెల్లించుటకు ఈనెల 31వ తేదీ చివరి అన్నారు. పసుపు పంట ఎకరాకు రూ.180 ఉల్లి పంటకు ఎకరాకు రూ. 90 చెల్లిస్తే పసుపుకు భీమా మొత్తం రూ. 2, 25000, ఉల్లికి భీమా మొత్తం రూ. 1,12,500 వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతుభరోసా ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను రాయచోటి వ్యవసాయశాఖ అధికారి (ఏఓ) కె.రాజేంద్రప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ సీజన్‌కు సంబంధించిన ఎరువుల నిల్వకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు అమ్మాలని సూచించారు. అలా కాకుండా ఎక్కువ ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 2025 సంవత్సరానికి కావాల్సిన ఖరీఫ్ ఎరువులు ఎక్కడా కొరత రాకుండా చూసుకోవాలని చెప్పారు.

స్కూల్ ఆటో డ్రైవర్లు నియమాలు పాటించాలి



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి

పెనగలూరు : పాఠశాలలకు విద్యార్థులను తరలించే ఆటో డ్రైవర్లు నియమ, నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులను వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చే ఆటో డ్రైవర్లు పాఠశాల వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలో విద్యార్థులను తీసుకువచ్చేటప్పుడు డోర్ వద్ద వేలాడుతూ తీసుకురాకుండా ఉండాలని సూచించారు. విద్యార్థులను కామెంట్ చేసిన, అసభ్యకరంగా ప్రవర్తించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులను పాఠశాల నుంచి తీసుకెళ్లేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల తాటతీస్తాం



మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లి : పాఠశాలలకు వెళ్లే ఆడపిల్లలను కొంతమంది ఆకతాయిలు ఏడిపిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకొని తాటతీస్తామని ఎస్‌ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల వద్దకు వెళ్లి ఆడపిల్లలను కొంతమంది ఆకతాయిలు ఏడిపిస్తున్నారని, అలాంటి వారిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. రవీంద్రనగర్, మర్రిచెట్టు వద్ద కొంతమంది ఆకతాయిల వేధింపులపై సమాచారం ఉందని, ఇలాంటివి దృష్టికి వస్తే పోలీసులకు తెలపాలన్నారు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు రాజశేఖర్, షర్ఫుద్దీన్, రామ్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

గాలివీడు : సైబర్ నేరాలపై ఎస్‌ఐ రామకృష్ణ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలసి సమావేశం నిర్వహించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, తెలియని వయసులో ప్రేమ, ఆకర్షణ, సోషల్ మీడియాతో పరిచయాలు, ఆన్‌లైన్ వేధింపులు, ప్రేమ పేరుతో వలవేసి చేసే ఆర్థిక, శారీరక, మానసికంగా ఇబ్బందులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్, చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకుందాం



దిన్నెపాడు వడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

లక్కిరెడ్డిపల్లి : క్షయవ్యాధి గ్రస్తులను దూరం పెట్టకుండా వారిని ఆదరించాలని జిల్లా క్షయవ్యాధి సూపర్‌వైజర్ సుబ్బయ్య పేర్కొన్నారు. ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా దిన్నెపాడు వడ్డిపల్లిలో క్షయవ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు వివరించి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్ష చేయించుకున్న వారికి క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ప్రతి నెల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందిస్తారన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతినెల క్షయ పోషణ యోజన కింద క్షయవ్యాధిగ్రస్తులకు రూ. 1000లు అందజేస్తుందన్నారు. క్షయవ్యాధి గ్రస్తుడు క్రమం తప్పకుండా మాత్రలు తినాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, సూపర్ వైజర్ హరి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం



రమేష్‌రెడ్డిని సత్కరిస్తున్న వీరబల్లి నాయకులు

వీరబల్లి : మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డిని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా పార్టీ కార్యాలయంలో కలిశారు. పార్టీ అభివృద్ధి పైన, ప్రజా సమస్యలు తదితర అంశాలపైన వారితో చర్చించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి గడ్డుకాలం దగ్గర పడిందన్నారు. కార్యకర్తలకు ఎటువంటి అన్యాయం జరిగినా తాము ముందుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ రెడ్డిని శాలువాలతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతం



మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు



పూజలందుకున్న మంగళగౌరీ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ మంగళగౌరీ సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మంగళగౌరీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు రవికాంత్‌శర్మ మాట్లాడుతూ శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యంగిరా హోమం, అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళగౌరీ వ్రతం వంటి పూజా కార్యక్రమాలను జరిపారు. సామూహిక మంగళగౌరీ వ్రతంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వ్రత విశిష్టత పొందే లాభాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక సమాజ నిర్మాణానికి కృషి



కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న జేవీవీ నాయకులు

ఒంటిమిట్ట : వైఎస్సార్ కడప జిల్లా జన విజ్ఞాన వేదిక మాజీ అధ్యక్షులు రౌఫ్ బాషా అధ్యక్షతన ఒంటిమిట్ట మండలంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాషా మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన మూఢ నమ్మకాలను పాలద్రోలి ప్రజలను, విద్యార్థులను విద్యావంతులను, శాస్త్రీయ దృక్పథం వైపు తీసుకునిరావడమే జేవీవీ లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి నవసమాజ, శాస్త్ర సాంకేతిక సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఒంటిమిట్ట మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎంఎల్ వెంకట సుబ్బయ్య, అధ్యక్షులుగా కె.తిరుపాల్, ప్రధాన కార్యదర్శిగా కేఎం సుబ్బారావు, సమతా కన్వీనర్‌గా సీడీపీ ప్రత్యూష, చెకుముకి కన్వీనర్‌గా వై.మస్తానయ్య, కార్యదర్శులుగా రౌఫ్ బాషా, సూర్యప్రకాష్, రమణ, కృష్ణారెడ్డి, ఖాజా మొహిద్దీన్, ఉపాధ్యక్షులుగా ఐజయ్య, రాజారెడ్డి, రెడ్డయ్య తదితరులను ఎన్నుకున్నారు.

పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఏర్పాటు

గాలివీడు : మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు పలువురు కార్యదర్శులు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమైన వారు నూతన కమిటీకి అధ్యక్షులుగా బి.ఆంజనేయులు నాయక్, ఉపాధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎస్.అలీ అంబర్ బాషా, జనరల్ సెక్రటరీ ఎస్.రసూల్ బాషా, గౌరవ అధ్యక్షులు ఎమ్.రమ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సుకుమార్, శివ నాయక్, మదన్ మోహన్, రాజేష్ రెడ్డి, నరేష్ సభ్యులుగా కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులపై మోపుతున్న పనిభారాన్ని తగ్గించాలని కోరారు.

ఓ రామా.. రోగుల మొర వినుమా!

- షిఫ్ట్ అయిపోయిందని వెళ్లిపోయిన వైద్య సిబ్బంది
- నొప్పి తాళలేక అల్లాడిపోయిన తేలుకాటు బాధితురాలు
- బాధితురాలి పరిస్థితిని చూసి సమాచారమిచ్చిన సాక్షి విలేకరిని ఎదురు ప్రశ్నించిన వైద్యాధికారి



ఉదయం 8:37 గంటలకు వైద్య సిబ్బంది లేకపోవడంతో తేలుకాటు నొప్పి తాళలేక బాధపడుతున్న నారాయణమ్మ



ఉదయం 8:42 గంటలకు వైద్య సిబ్బంది లేక నిర్మానుష్యంగా ఉన్న ఒంటిమిట్ట పీహెచ్‌సీ

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న శ్రీ కోదండ రామస్వామి వెలసిన ఒంటిమిట్టలోని పీహెచ్‌సీ 24/7 అనారోగ్యంతో విచ్చేసే ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఎలాంటి సౌకర్యం అనేది కనిపించడం లేదు. మంగళవారం ఉదయం 8:30 గంటల సమయంలో ఒంటిమిట్ట పీహెచ్‌సీకి తేలు కాటుతో బాధపడుతూ మండల పరిధిలోని సీతాపురానికి చెందిన ఎస్.నారాయణమ్మ అనే మహిళ వైద్యం కోసం వచ్చింది. అయితే అక్కడ ఆమెకు వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది ఏ ఒక్కరూ లేరు. దీంతో నారాయణమ్మ తేలుకాటు వల్ల తీవ్రమైన నొప్పితో అల్లాడిపోయింది. ఆమె అవస్థలు చూడలేక అటుగా వచ్చిన 'సాక్షి' విలేకరి ఒంటిమిట్ట మండల వైద్యాధికారిణి డాక్టర్ భావనకు చరవాణి ద్వారా సమాచారాన్ని అందజేశారు. విషయం తెలుసుకున్న వైద్యాధికారిణి భావన వెంటనే వైద్య సిబ్బంది ఎవరైన అందుబాటులో ఉన్నారా లేరా అని విచారించి, లేకపోవడంతో అక్కడే ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ చేత తేలుకాటుతో బాధపడుతున్న నారాయణమ్మకు వైద్యం అందించడం జరిగింది. ఇది చూసిన రోగులు 24/7లో తదుపరి షిఫ్ట్ సిబ్బంది రాకముందే నైట్ డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బంది పీహెచ్‌సీ నుంచి వెళ్లిపోవడంపై సమన్వయలోపం చూపుతోందని మండల ప్రజలు, అక్కడికి వచ్చిన రోగులు వాపోతున్నారు.



ఖాళీగా ఉన్న స్టాఫ్ రూం

మీరెందుకు ఫోన్ చేశారు? సాక్షి విలేకరితో వైద్యాధికారి

తేలుకాటు బాధితురాలి చికిత్స అందించాల్సిన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో విషయాన్ని అధికారి దృష్టికి తీసుకెళ్లిన సాక్షి విలేకరి పట్ల వైద్యాధికారి స్పందించిన తీరు ఆశ్చర్యానికి గురిచేసింది. ఆమె (నారాయణమ్మ) గురించి మీరు ఎందుకు ఫోన్ చేస్తున్నారు అని ప్రశ్నించడం అవాక్కు అయ్యేలా చేసింది. సిబ్బంది లేక రోగులు పడుతున్న ఇబ్బందులు వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లడాన్ని ఓర్వలేకపోవడం పట్ల వైద్యాధికారి తీరును పలువురు రోగులు తప్పుబడుతున్నారు. ఆస్పత్రికి వచ్చే పేదల పట్ల ఆమెకు ఉన్న శ్రద్ధ, విధి నిర్వహణలో సిబ్బంది చేస్తున్న నిర్లక్ష్యాన్ని దృష్టి సారించి రోగులకు చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.